సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను
- పెంచిన పింఛన్ల పంపిణీ ప్రారంభం



కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ ఉదయభాను, ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం పండుగ వాతావరణంలో జరిగిన 'వైఎస్సార్ పింఛన్ కానుక' పెంపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని పెంచుతూ రూ.3 వేలు చేసి ఇచ్చిన మాటను నూరు శాతం అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయంతో ఎందరికో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇవ్వటం లేదన్నారు. ఎక్కువ సంఖ్యలో పింఛన్లు, ఎక్కువ మొత్తంలోనూ పింఛన్ ఇస్తున్న జగనన్న ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

టీడీపీ తీరు సిగ్గు చేటు

నియోజకవర్గంలో ప్రస్తుతం అన్ని రకాల పింఛన్‌దారులు 33,243 మంది ఉండగా, కొత్తగా 500 మంది వరకు పింఛన్ మంజూరైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించి చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన సొంత లాభాపేక్షలు చూసుకున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పింఛన్ పెంపుపై కూడా టీడీపీ దిగుజారుడు రాజకీయాలు చేయటం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. గతంలో సంక్షేమ పథకాల కోసం టీడీపీ నాయకులు, కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, నేడు ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా సెల్‌ఫోన్‌పై వేసుకునే స్టిక్కర్లను, నవాబుపేట గ్రామంలో టీటీడీ వారి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిర్మించే రామాలయాలనికి సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకలాని, ఎంపీడీఓ హర్షసాయి, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలానికి నూతనంగా మంజూరైన రూ. మూడు వేల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల నుంచి ప్రభుత్వం పింఛన్‌ను పెంచి అందిస్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని రకాల పింఛన్లను వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. మండలంలో 148 నూతన పింఛన్‌లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, ఈవోపీఆర్డీ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. గండ్రాయిలో సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి పింఛన్లను పంపిణీ చేశారు.

అవ్వా తాతలకు ఘనమైన మర్యాద..

వత్సవాయి(పెనుగంచిప్రోలు): ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో అవ్వాతాతలకు వారి కుటుంబాల్లో ఘనమైన మర్యాద, భద్రత లభిస్తోందని యువజన నాయకులు, జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. వత్సవాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలో నూతనంగా మంజూరైన పెంచిన పింఛన్ల పంపిణీ కార్యాక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ కె.రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం కావటం గర్వంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గుత్తా శంకరరావు, వైస్ ఎంపీపీలు కాటేపల్లి రామలక్ష్మి, కె వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు కెక్కర ముక్తేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, నాయకులు గాదెల రామారావు, రాజానాయక్, ఎంపీడీఓ రమేష్ బాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.


చిల్లకల్లులో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు


వత్సవాయిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వెంకటకృష్ణప్రసాద్, ఎంపీపీ రమాదేవి తదితరులు

పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలి



బలుసుపాడు(జగ్గయ్యపేట): వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలని మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ కోరారు. గ్రామ పార్టీ కన్వీనర్ ఆతుకూరి గోపాలరావు అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే శాంతియుతంగా ఉండటంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం గోపాలరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశరావు, మండల యూత్ కన్వీనర్ బజారు సాయి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వాహనం తనిఖీ



నందిగామ: ఎండీయూ వాహనం ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి తప్పనిసరిగా రేషన్ అందజేయాలని ఆర్డీఓ సాయిబాబు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో 12వ నంబర్ ఎండీయూ వాహనాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని కార్డుదారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రేషన్ సరఫరాలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి వాహనంపై నిఘా ఉందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, పౌరసరఫరాల శాఖ డీటీ కె.రామ్మూర్తి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు విద్యార్థి ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: గుంటూరు జిల్లాలో ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమయ్యే అండర్–14 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌కు కృష్ణా జిల్లా జట్టుకు జగ్గయ్యపేటకు చెందిన బంగారు సాయి ప్రణీత్ ఎంపికయ్యాడు. విద్యార్థి సాయి ప్రణీత్ స్థానిక లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి బంగారు బ్రమరాచారి బంగారపు వస్తువుల వర్క్ చేస్తుంటాడు. కాగా ప్రణీత్ గత రెండేళ్లుగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న ఏసీఏ, కేడీసీఏ, బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ నెట్స్‌లో శిక్షణ పొందుతున్నాడు. బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు, పీఈటీ వి.ప్రసాద్ ప్రణీత్‌ను అభినందించారు. కోచ్ రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు పెంచిన పింఛన్ల పంపిణీ

నందిగామ: పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ పింఛన్ కానుకను ఈ నెల నుంచి రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచారు. పట్టణ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉదయం 11.30 గంటలకు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ




కంచికచర్ల: స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయం ఆవరణలో 2024వ సంవత్సరం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఎంఈఓ–1, 2లు ఆదూరి వెంకటరత్నం, బాలాజీ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులు కృషి చేయాలన్నారు. క్యాలెండర్, హ్యాండ్ బుక్, సీఎల్ బుక్, డైరీ, స్టిక్కర్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ విక్టర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు నంద్రు సురేష్‌బాబు, కార్యదర్శి బల్లా రవికుమార్, నాయకులు ఎం.సుధాకర్, శేషం గోపాలరావు, శేషం వెంకట్రావు, జి.వెంకటేశ్వర్లు, విజయశ్రీ, నీలిమ, ఆశాజ్యోతి, మౌలాలి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: నియోజకవర్గంలోని పలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని గంధం పట్టుతో అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక నేతృత్వంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ ఉపయోగించుకుని టెన్త్ క్లాస్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను 220 మంది టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలల రూపురేఖలు మార్చారని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- గనిఆత్కూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


గనిఆత్కూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గనిఆత్కూరు(కంచికచర్ల): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని గనిఆత్కూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే సీఎం ధ్యేయమని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకేలు, మన బడి, నాడు – నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం అందించడం, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. అనేక ప్రభుత్వ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేస్తామని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల హరిజగన్నాథరావు, గ్రామ సచివాలయాల గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు పాటిబండ్ల చినతిరుపతిరావు, గుదే శ్రీనివాసరావు, వెంపరాల సాంబశివరావు, షేక్ జానీబాషా, మార్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకే 'ఆరోగ్య సురక్ష'

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశమని బూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని సర్పంచ్ గుదారు పేరయ్య ప్రారంభించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తోందన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు స్రవంతి, నాగరాణి, చంద్రశేఖర్, హారిక, గ్రామ నాయకులు గుగులోతు బుజ్జి నాయక్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, శేఖర్‌బాబు, ఏఎన్ఎంలు మాధవి, వనజాక్షి, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్యమందించటమే లక్ష్యం..

వీరులపాడు: నిరుపేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యమందించటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మండలంలోని జుజ్జూరు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదవాని ఆరోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేశాయన్నారు. ముఖ్యంగా నిరుపేదలకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సైతం వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు నిష్ణాతులైన వైద్యాధికారులతో గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని కొనియాడారు. ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యమందిస్తున్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ఊహకందని రీతిలో రూ.25 లక్షల వరకు పెంచారని చెప్పారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ రమావత్ కోటి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, వైద్యాధికారులు గౌతమ్, దీపిక, నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత వైద్యమే ప్రభుత్వ లక్ష్యం..

శివాపురం(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. మండలంలోని శివాపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో రోగులు పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు మెడికల్ కిట్లు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, ఎంపీడీఓ హర్షసాయి, వైద్యాధికారి సుజన, గ్రామ పార్టీ అధ్యక్షుడు లగడపాటి జనార్దన్, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జుజ్జూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


శివాపురంలో కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు


వేదాద్రిలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

విస్తృతంగా రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రెయిన్లు, రహదారుల నిర్మాణం విస్తృతంగా చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక 26వ వార్డులోని ఇసుకవాడు రోడ్డుకు ఇరువైపులా నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రెయిన్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఇసుకవాగు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బురదమయంగా ఉందన్నారు. కనీసం ఇంట్లోకి వెళ్లడానికి కూడా దారిలేకుండా మురుగునీరు చేరుతుందని వార్డు కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ కౌన్సిల్ సమావేశంలో తెలియజేశారన్నారు. దీంతో రూ.5.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం 31వ వార్డులో 150 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న జెండా స్థూపం నిర్మాణ పనులను చైర్మన్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, గింజుపల్లి వెంకట్రావు, నాయకులు డేవిడ్‌రాజు, మోరె బాబీ, విజయవాడ కనకదుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌పై అవగాహన

పెండ్యాల(కంచికచర్ల): ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందని తహసీల్దార్ పి.శంకరబాబు అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ పనితీరుపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీ ప్యాట్స్, నోటా లాంటి కొత్త విధానాలతో ఓటర్లకు భరోసా కల్పించిందన్నారు. కంట్రోల్ యూనిట్‌పై బ్యాలెట్ బటన్ నొక్కటం ద్వారా పోలింగ్ అధికారి బ్యాలెట్‌ను విడుదల చేస్తారని చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థికి ఎదురుగా బ్యాలట్ యూనిట్‌పై నీలం బటన్ నొక్కటం ద్వారా ఓటరు తన ఓటు వేయడానికి అనుమతి ఇస్తోందన్నారు. ఈవీఎంలు ఓట్లను తారుమారు చేయడానికి ఎటువంటి అవకాశం లేదని తెలిపారు. ఈవీఎంలు సాధారణ బ్యాటరీలపై పనిచేస్తాయని, వాటికి విద్యుత్ అవసరం లేదన్నారు. ఒక్కో ఓటింగ్ మిషన్ గరిష్టంగా 2 వేల ఓట్లను నమోదు చేయవచ్చన్నారు. డేటా డిలెట్ చేయబడేవరకు లేదా క్లియర్ అయ్యేంత వరకు కంట్రోల్ యూనిట్ మెమరీలో ఫలితాలను నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద పేపర్ రోల్ మార్చటం నిషేధించబడిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్, పీర్ సామియా, నిస్సార్ బాషా, పోలీస్ సిబ్బంది, ఆపరేటర్, వీఆర్వోలు, ఓటర్లు పాల్గొన్నారు.


పెండ్యాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం


పేటలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను దంపతులు


సుందరకాండ పారాయణం చేస్తున్న భక్తులు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో మంగళవారం సుందరాకాండ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు పీటలపై కూర్చొనగా విజయవాడకు చెందిన ఆధ్యాత్మిక గురుస్వామి శివరామ్ ఆధ్వర్యంలో పారాయణం జరిగింది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుదీర్ఘంగా 6 గంటల పాటు జరిగిన పారాయణం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పారాయణం చేశారు. ఈ సందర్భంగా కలశంలో తీసుకువచ్చిన అయోధ్య రామ మందిరానికి చెందిన రాముని తలంబ్రాలను భక్తులకు అందజేశారు. అనంతరం పారాయణంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలను, భోజనాన్ని ఏర్పాటుచేశారు.

నేడు ప్రారంభోత్సవాలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గూడపాటి లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం, పెట్రోల్ బంక్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, సచివాలయ భవనాన్ని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ప్రారంభిస్తారన్నారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

గోళ్లమూడిలో..

నందిగామ: జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలంలోని గోళ్లమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభిస్తారని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ మంగళవారం తెలిపారు. గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనంతో పాటు సహకార సంఘ భవనాన్ని ఉదయం 11.30 గంటలకు ప్రారంభిస్తారన్నారు.